## క్లుప్తంగా

### నేడు రైతులతో వీడియో కాన్ఫరెన్స్

మంచాల: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని మంచాల మండల వ్యవసాయాధికారి జ్యోతిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలచే పంటసాగుపై వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. వరి పంట సాగుపై అవగాహన, ఆయిల్‌పాం సాగుపై మెలుకువలు, వేసవిలో వివిధ రకాల కూరగాయ పంటల్లో వాడదగు పురుగు మందులు తదితరవాటిపై అవగాహన కల్పిస్తారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

### నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌లో కొలువైయున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదురోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. వేడుకలకు సంబంధించి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### విద్యార్థులకు పెన్నుల పంపిణీ



విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: పదోతరగతి పరీక్షలు విద్యార్థులకు కీలకమని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు ఆయన పెన్నులను అందజేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు బాగా రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ అనిత, సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యా, నాయకులు పాండు, జంగయ్య ఉన్నారు.

### సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

షాద్‌నగర్: అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందుకు గాను సోమవారం ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాటకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందన్నారు. కేసీఆర్ చేపట్టిన విధానాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంతా అస్తవ్యస్తమైందన్నారు. షాద్‌నగర్‌లో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం తాలుక అధ్యక్షుడు మేడిగ పెంటయ్య, మంచిరేవుల సాయికృష్ణ, గుండు నారాయణ, మల్చలం మురళి, చంద్రశేఖర్, ఇస్నాతి శ్రీనివాస్, శ్రీశైలం, రాజగోపాల్, శంకరయ్య, పద్మారావు, విద్యాసాగర్, దివాకర్, మేడిగ శ్రీనివాస్, అశోక్, రాజు పాల్గొన్నారు.

### పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కొందుర్గు: గర్భిణులు, బాలింతలు విధిగా పోషకాహారం తీసుకోవాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ నాగమణి సూచించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయాలు ప్రతినిత్యం ఆహారంలో తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రేవతి, శివరాణి, అంగన్‌వాడీ టీచర్ సంగీత పాల్గొన్నారు.

### అక్రమ కట్టడాల కూల్చివేత

కొత్తూరు: ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లో చేపట్టవద్దని కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 167లో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మించిన కట్టడాలను సోమవారం ఆయన తన సిబ్బందితో కలిసి కూల్చి వేయించారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను చేపడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్యాణ వైభోగమే

- కనులపండువగా వేంకటేశ్వరస్వామి, గోపాలస్వామి కల్యాణోత్సవాలు
- ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు
- తరలివచ్చిన భక్తజనం



ఆమనగల్లు: వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు



ఆమనగల్లు: వేడుకలను తిలకిస్తున్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పట్టణ ప్రజలతో పాటు, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యుల బృందం నిహాల్, అనిల్‌కుమార్, వెంకటరమణచారి, కృష్ణచైతన్యచారి, సంజీత్‌పాండే, శ్రీకాంత్ ఆధ్వర్యంలో వేడుక అట్టహాసంగా ప్రారంభమైంది. శాంతమ్మ, సుజాత, పుష్పలత, రాజేశ్వరి, తనుశ్రీ,, జ్యోతి ఆధ్వర్యంలో కల్యాణ వేడుక వైభవంగా సాగింది. లింగయ్య, సీతమ్మ, భాస్కర్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాట్యమయూరి శాన్వీ ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

**గోపాలస్వామి కల్యాణోత్సవంలో**

తలకొండపల్లి: కల్కిదోనగుట్ట గోపాలస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మండల పరిధిలోని చుక్కాపూర్ శివారు ప్రాంతంలోని జోతీష్యాశ్రమ సమీపంలో వెలిసిన కల్కిదోనగుట్ట దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గణపతి పూజ, అభిషేకం, పుణ్యహవాచనము అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు గోపాలస్వామి కళ్యాణాన్ని నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి ముడుపులు చెల్లించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండరీ, ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ, ఆలయ కార్యనిర్వాహక సభ్యులు కృష్ణమూర్తి, నితిన్‌శర్మ, ప్రముఖ వ్యాపారవేత్త శ్యాంసుందర్, అంజిరెడ్డి, పాండురెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, యాదయ్య, ప్రేమోజి, భక్తులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: గోపాలస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

# వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆలయాల్లో శ్రీరామ, శివపార్వతులు, సరస్వతీ దేవి, శ్రీచక్ర విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకుడు లీలా లక్ష్మారెడ్డి దంపతుల సహకారంతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఆలయాల ప్రాంగణంలో వేదపండితులు వేంకటేశ్వర శర్మ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ ప్రముఖ విద్యావేత్త, ఆధ్యాత్మిక ప్రవచనకర్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విద్యాశాఖ మాజీ సంచాలకుడు మన్మథ్‌రెడ్డి, మహేశ్వర మహా పిరమిడ్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీందర్‌రావు శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రాన్ని సందర్శించి, పూజలు జరిపారు. ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, రాంరెడ్డి, ఎంపీపీ కమ్లీ, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, బీక్యానాయక్, బీచ్యానాయక్, వేణుగోపాల్, హన్మానాయక్, యాదగిరిరెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజుగౌడ్, జగన్, రామకృష్ణ, వెంకటేశ్ ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న లీలా లక్ష్మారెడ్డి దంపతులు

### నేడు మహాజన సభ

తుర్కయంజాల్: ది తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ 50వ మహాజన సభ (సర్వసభ్య సమావేశం) మంగళవారం తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని.. రైతులు, సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### సాగర్‌రోడ్డుపై వాహనాల తనిఖీ

యాచారం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. యాచారం సీఐ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం సాగర్ రోడ్డుపై యాచారం, గునుగల్, మాల్ కేంద్రాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. అధికమొత్తంలో డబ్బు తీసుకెళ్తున్నట్లయితే తప్పక బ్యాంకు, సంబంధిత రసీదులు ఉండాలన్నారు.

### ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవునిపడకల్‌కు చెందిన తుమ్మల ముత్యాలమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసురెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం ఆమెను పరామర్శించి ఇద్దరూ కలిసి రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, సత్యం, భిక్షపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ కోడ్ కూసిన వేళ..



అష్మత్‌పూర్‌లో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది



నోములలో రాజీవ్ గాంధీ విగ్రహానికి వేసిన ముసుగు

మంచాల: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది దానిని అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో ఉండే రాజకీయ పార్టీల జెండాలను తొలగించడంతో పాటు నాయకులు విగ్రహాలు కనిపించకుండా కవర్లు కప్పుతున్నారు. గోడలపై రాసిన రాజకీయ నినాదాలు, రాతలను తుడిచివేస్తున్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగిస్తున్నారు. కోడ్‌ను ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# మహిళల విజయాలను గుర్తించడం బాధ్యత

మొయినాబాద్‌రూరల్: మహిళలు విజయాలు సాధించినప్పుడు వేడుకలు జరుపుకునేందుకు ముందుండాలని కేఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి కోనేరు శివకాంచనలత అన్నారు. మహిళా విజయాలను గుర్తించడం అందరి బాధ్యత అన్నారు. సోమవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో గల కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో మహిళల విజయాలతో వేడుకలు జరుపుకోవడానికి ఫేమ్ ప్లేయర్ 2కే 24 అనే పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోనేరు శివకాంచనలత పాల్గొని ఆమె మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన అసాధారణ విజయాలు సాకారాన్ని స్మరించుకోవడంలో ముందుండాలన్నారు. అందులో భాగంగా కేఎల్ డీమ్డ్ టూమీ విశ్వవిద్యాలయంలో మొదటి స్థానంలో ఉందని ఉమెన్స్ డెవలప్‌మెంట్ సెల్ మహిళా విద్యార్థినులు, అధ్యాపకులు అంకితభావం, నైపుణ్యాలను గుర్తించి గౌరవించాలనే నిబద్ధతను సూచించారు. ఫేమ్ ప్లేయర్ 2కే 24ను ఉమెన్స్ ఫోరం ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఇది మహిళలకు సాధికారిత చైతన్యం కలిగిస్తుందని పేర్కొన్నారు. మహిళలు సాధించిన విజయాలకు క్రెడిట్ ఇవ్వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ పార్థసారథివర్మ, వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమ్య, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవలందించిన మహిళలను సన్మానిస్తున్న అతిథులు

# పురాతన ఆలయాలను కాపాడుకోవాలి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాలను కాపాడుకోవాలని బీజేపీ చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల గ్రామంలో సోమవారం గ్రామ శివారులో ఉన్న ఈశ్వరుని బాయి దగ్గర ఉన్న సహజ బ్రహ్మసూత్ర శివాలయ నూతన ఆలయ నిర్మాణం, ప్రాణప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో బీజేపీ నాయకుడు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు చేసిన ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణ బీజేపీతోనే సాధ్యమవుతుందని చెప్పారు. అందుకే కేంద్రంలో ప్రధానిగా మోదీనే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున్‌రెడ్డి, శివకుమార్, ఆలయ ధర్మకర్త పి.లక్ష్మారెడ్డి, గ్రామస్తులు కరణ్‌జీ, రుషికేశ్‌గౌడ్, రాందేవ్, సత్యనారాయణ, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు

# ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయండి

సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నేత రాజేష్ వినతి

కడ్తాల్: కడ్తాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు రాజేష్ సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల సమస్యలపై గతంలో ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపట్టామని.. అదే విధంగా మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి లేకపోవడంతో పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఈ విషయమై సీఎం సానుకూలంగా స్పందించారని రాజేష్ తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రాజేష్

# మల్‌రెడ్డి రాంరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ఇబ్రహీంపట్నం: రాంరెడ్డికి అభినందనలు తెలుపుతున్న నాయకులు



యాచారం: రాంరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



అబ్దుల్లాపూర్‌మెట్: రాంరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

యాచారం: రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని సోమవారం యాచారం మండల కాంగ్రెస్ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో యాచారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మల్‌రెడ్డి రాంరెడ్డిని ఘనంగా సన్మానించారు.

**మంచాల నుంచి..**

మంచాల: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు జయమ్మ సోమవారం నగరంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డిని కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నేతలు మల్లేశ్, శ్రీధర్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

**శుభాకాంక్షలు తెలిపిన నేతలు..**

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డికి సోమవారం కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు భాస్కర్‌చారి, గండిచెరువు మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు గోపాల్‌రెడ్డి, కొండల్‌గౌడ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

**తుర్కయంజాల్ నుంచి..**

తుర్కయంజాల్: రాష్ట్ర రోడ్ల అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని తుర్కయంజాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహ, వినోద్, యాదగిరి, సురేష్, రమేష్, సూరి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**ఇబ్రహీంపట్నం నియోజవకర్గం నుంచి..**

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్‌రెడ్డి రాంరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. సోమవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లి రాంరెడ్డికి అభినందలు తెలిపారు. పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ తిరుమల్‌రెడ్డి, నాయకులు చందు,దాసు, రాంరెడ్డి, అర్జున్ తదితర నేతలు..రాంరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# కార్మికుల బదిలీలను మానుకోవాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్
- ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందిని బదిలీ చేయడం మానుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, మున్సిపాలిటీ రంగం జిల్లా కార్యదర్శి డీ.కిషన్ కోరారు. సోమవారం ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి సీఐటీయూ కన్వీనర్ నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పది నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్మికులకు ప్రతి ఆదివారం సెలవు ఇవ్వాలన్నారు. కార్మికులను అనవసరంగా బదిలీలు చేయడం తగదని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ, ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ బుగ్గరాములు, తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు సత్యనారాయణ, బాబు, జగన్, అనిల్, ఉపేందర్, కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

# పది పరీక్షలు ప్రారంభం



ఆమనగల్లు: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఇబ్రహీంపట్నం: పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, పేరెంట్స్ సందడి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఎస్‌ఎస్‌సీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 280 మంది విద్యార్థులకు గాను 279 విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 276కి గాను 276 మంది విద్యార్థులు పరీక్షలకు మాజరైనట్లు ఎంఈఓ సర్దార్‌నాయక్ తెలిపారు. ఎస్‌ఐ బల్‌రాంనాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

**మంచాల మండల కేంద్రంలో..**

మంచాల: మంచాల మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మంచాల బాలుర ఉన్నత పాఠశాల సెంటర్‌లో 150 మంది, మంచాల బాలికల ఉన్నత పాఠశాల సెంటర్‌లో 153 మంది, మంచాల కేజీబీవీ పాఠశాలలో 220 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

**కడ్తాల్ మండలంలో..**

కడ్తాల్: మండలంలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని ఏ-సెంటర్‌లో 220 మందికి గాను 219 మంది పరీక్షకు హాజరుకాగా, బీ-సెంటర్‌లో 194 మందికి 194 మంది హాజరయ్యారు. అదే విధంగా మండల పరిధిలోని ముద్విన్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 95 మందికి 95 మంది విద్యార్థులు పరీక్షకు హజరయ్యారు. మొత్తం మండలంలో 509 మంది విద్యార్థులకు గాను 508 మంది పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు చందులాల్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ అధికారులు శ్రీధర్, చల్మారెడ్డి, కృష్ణయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్‌ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

**కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు**

తలకొండపల్లి: మండలంలో ఏర్పాటు చేసిన రెండు 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు పేపర్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రంలో 254 మందికి 253 మంది,వెల్జాల్ పరీక్షా కేంద్రంలో 102 మందికి గాను 100 మంది పరీక్ష రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు పర్వతాలు, రామనాథం తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్‌రంగారెడ్డి, ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంఈఓ సర్దార్ నాయక్, ఫ్లైయింగ్ స్క్వాడ్ వెంకట్‌రమణారెడ్డి తనిఖీ చేసినట్లు సీఎస్‌లు చెప్పారు. ఒక్కరు కూడా డీబార్ కాలేదని తెలిపారు.

**మాడ్గుల మండలంలో..**

మాడ్గుల: మండలంలో పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 493 విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో పెట్టారు. విద్యార్థులకు అత్యవసర ప్రాథమిక వైద్య సదుపాయలను కూడా సమకూర్చారు.

**యాచారం మండలంలో..**

యాచారం: మండలంలో పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. నందివనపర్తి, యాచారం ఉన్నత పాఠశాల, గునుగల్ ఆదర్శపాఠశాల, యాచారంలోని జోవియల్ ఉన్నత పాఠశాల, పుడమి ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐదు పరీక్ష కేంద్రాల్లో 888 మందికి గాను మొదటి రోజు తెలుగు పరీక్షకు 887 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.

**ఇబ్రహీంపట్నం మండల పరిధిలో..**

ఇబ్రహీంపట్నం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 2,320 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 9 పాఠశాలల్లో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతినిచ్చారు. మొదటి పరీక్షకు ఒకే ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.